
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
శుక్రవారం, 9 ఆగస్టు 2024
5



స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురం హవేలి, ఆగస్టు 8: ఉమ్మడి జిల్లాలోని బీసీ నిరుద్యోగ యువతీ యువకుల నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి నవంబరు 30వరకు నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో నెలకు రూ.4వేల చొప్పున మూడు నెలలు స్టైఫండ్ అందిస్తారని తెలిపారు. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సున్న ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 24లోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 95738 59598 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

■ నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



కొండకోనల నడుమ కన్నీటి పాయ



దశాబ్దాలు గడుస్తున్నా మారని ఆదివాసీల బతుకులు

- అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వాలు
- అయినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే...
- గిరిజన గూడాల్లో మౌలిక వసతులు కరువు
- అందని విద్య వైద్యం.. దరిచేరని రవాణా సౌకర్యం..
- కొనసాగుతున్న మాతా శిశు మరణాలు
- అనారోగ్య పీడితులను జడ్డీలో తీసుకువెళాల్సిన దయనీయ పరిస్థితి
- సంస్కృతి, సంప్రదాయాలతో తమదైన అస్తిత్వం

ఆదివాసీలకు అడవితో విడదీయని బంధం.. అమాయకత్వమే వారి ఆభరణం.. వేటంటే ప్రాణం... ప్రకృతే వారి దైవాలు... అడవి జంతువులే వారి నేస్తాలు.. అటవీ ఫలాలే వారి జీవనాధారం.. వారిది ప్రత్యేక భాష... ప్రత్యేక వేషధారణ. మూలవాసులమైన తామే ఈ దేశానికి అసలు వారసులుగా ఆదివాసీలు భావిస్తుంటారు. ఆద్యంతం అడవితో పెనవేసుకుపోయిన వారి బంధం, కట్టుబాట్లు, పరస్పరం అందించుకొనే చేయూత అందరికీ ఆదర్శనీయం. అయితే స్వాతంత్ర్యం సిద్ధించి 7 దశాబ్దాలు పూర్తవుతున్నప్పటికీ ఆదివాసీలు ఇంకా తమ హక్కుల కోసం, చట్టాల అమలు కోసం గొంతెత్తి నినదించాల్సిన దుస్థితిలోనే ఉన్నారు. ఇప్పటికీ ఆదివాసీ గూడాలకు కనీస వసతులు దూరంగానే ఉన్నాయి. రాకపోకలకు కనీస రహదారులు లేవు. పాఠశాలలు, ఆస్పత్రులు అందుబాటులో లేవు. పోషకాహార లోపంతో పిల్లలు... సరైన వైద్యం అందక వయోజనులు.. ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. ప్రభుత్వాలు ఎన్ని పథకాలు చేపట్టినా ఆదివాసీల బతుకుల్లో మార్పు రావడం లేదు.


జడ్డీలో ఆసుపత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

వివరాలు 6లో

-భద్రాచలం

వైరాలో చరిత్రాత్మక సభ

- 15న సీఎం చేతులమీదుగా రుణమాఫీ చెక్కుల పంపిణీ
- వచ్చే సాగు సీజన్ నాటికి ఉమ్మడి జిల్లా అంతటికీ 'సీతారామ' జలాలు
- వైరా నియోజకవర్గం నుంచి 25వేల మందిని సమీకరించాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సభ ఏర్పాట్ల పరిశీలన



వైరా, ఆగస్టు 8: ముందుగా నిర్ణయించినట్లు వైరాలో ఈ నెల 15వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో రైతు బహిరంగ సభ యథావిధిగా నిర్వహిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అదే సభలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చెక్కులను పంపిణీ చేస్తామన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య సంబురాలు జరుపుకొని అదే రోజు రూ.రెండు లక్షల రుణమాఫీతో తెలంగాణలోని రైతులు సంబరాలు చేసుకోవడం సంతోషదాయకమన్నారు.

వైరాలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభ స్థలంలో ఏర్పాట్లను గురువారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి మంత్రి తుమ్మల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాటాడుతూ 15న సీఎంతో నిర్వహించే సభ రాష్ట్ర చరిత్రలోనే చరిత్రాత్మకంగా నిలుస్తుందన్నారు. ఆగస్టు 15న సీఎంకు బిజీ షెడ్యూల్ ఉన్నా తాము కోరిన వెంటనే సీతారామ ప్రాజెక్ట్ పంపుహౌస్‌లను ప్రారంభించి ప్రజలకు అంకితం చేసేందుకు అంగీకరించారని తెలిపారు. సీతారామ హెడ్‌వర్క్స్ వద్ద గానీ, పంపుహౌస్-1, 2 వద్దగానీ సీఎం సభ నిర్వహించే అవకాశం ఉందని అయితే అది అటవీ ప్రాంతం కావడంతో ఇప్పటికిప్పుడు అక్కడి భూములకు గోదావరి జలాలు అందే అవకాశం లేనందున వైరాలో రైతులతో సభ ఏర్పాటు చేశామని తెలిపారు. కొండలు, గుట్టలు దాటి గోదావరి జలాలు ప్రస్తుతం వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని 1.20 లక్షల ఎకరాలను ముద్దాడబోతున్నాయని తెలిపారు. జూలూరుపాడు, వైరా టన్నెల్ పూర్తి చేసిన వెంటనే వాటి పరిధిలో డిస్ట్రిబ్యూటరీలు, ఇతర నిర్మాణాలు చేపట్టి కొత్తగూడెం, అశ్వారావుపేట, పినపాక తదితర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాలకు సీతారామ జలాలు పారించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నుంచి బహిరంగ సభలో స్పష్టమైన హామీ తీసుకుంటామని తుమ్మల పేర్కొన్నారు.

సీఎం సభకు అవసరమైన ఏర్పాట్లను ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ సమన్వయంతో చూసుకుంటారని మంత్రి స్పష్టం చేశారు. జనసమీకరణను ముఖ్యంగా వైరా నియోజకవర్గం నుంచి 25 వేలమంది రైతులను సమీకరించి సభ ముందుభాగంలో కూర్చోబెట్టాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను ఆదేశించారు. అలాగే కాంగ్రెస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా వైరా ప్రాంతం నుంచి రైతులను అధిక సంఖ్యలో సమీకరించాలని సూచించారు. కార్యక్రమంలో వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, ఖమ్మం ఆర్డీవో గణేష్, ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, వైరా, కొణిజర్ల మండల, పట్టణ కార్యదర్శులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, ఏదునూరి సీతారాములు, నాయకులు కట్ల రంగారావు, కోసూరి శ్రీను, కట్ల సంతోష్, పొదిల హరినాథ్, ధార్న రాజశేఖర్, మట్టూరి కృష్ణారావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలకు కంచెలు వేయండి

- ఇందిరమ్మ ఇళ్లకు స్థలాలు చూడండి
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

6

సీడీఎంఏ డైరెక్టర్ వీపీ గౌతమ్ రాక



- ఖమ్మంలో 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమానికి హాజరు
- ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి స్టేడియం వరకు ర్యాలీలో భాగస్వామ్యం
- డంపిగ్‌యార్డులో బయో మైనింగ్ వ్యర్థాల ప్రక్రియ పరిశీలన
- నగర సమస్యలపై కేఎంసీ అధికారులతో సమీక్ష
- మర్యాద పూర్వకంగా మంత్రి తుమ్మలతో భేటీ

6


ర్యాలీలో పాల్గొన్న సీడీఎంఏ డైరెక్టర్ గౌతమ్, మేయర్ పునుకొల్లు నీరజ



వైరా రిజర్వాయర్ పరవళ్లు

- పూర్తిస్థాయి నీటిమట్టంతో జలకళ..
- అలుగుపారుతున్న ప్రాజెక్టు

వైరా, ఆగస్టు 8: ఖమ్మంజిల్లాలోని వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టాన్ని దాటి గురువారం వేకువజాము నుంచి పొంగి ప్రవహిస్తుంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా వరదనీటితో 18.10అడుగులకు చేరుకుంది. దాంతో రిజర్వాయర్‌కు చెందిన పెద్ద అలుగులు, చిన్నఅలుగుల నుంచి వరదనీరు నదిలోకి పొంగి ప్రవహిస్తుంది. కేవలం మూడురోజుల వ్యవధిలోనే రిజర్వాయర్‌కు ఆరు అడుగులకుపైగా వరదనీరు వచ్చిచేరింది. రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియా అయిన ఏన్కూరు, కొణిజర్ల, కామేపల్లి, రఘునాథపాలెం, తల్లాడ తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో నిమ్మవాగు, పగిడేరు ఇతర వాగులు, వంకల నుంచి భారీ వరదనీరు రిజర్వాయర్‌కు వచ్చిచేరింది. దాంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

వైరా మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



వైరా, ఆగస్టు 8: ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం తొలిసారి వైరా మండలంలో అధికారిక పర్యటన చేయనున్నారు. ఉదయం 7.30గంటలకు హైదరాబాద్ ప్రజాభవన్ నుంచి రోడ్డు మార్గం గుండా బయల్దేరి ఉదయం 11 గంటలకు వైరా నియోజకవర్గ కేంద్రానికి చేరుకుంటారు. ఉదయం 11.30గంటల నుంచి భట్టి విక్రమార్క పర్యటన ప్రారంభమవుతుంది. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. మొదట వైరాలో అమృత పథకం కింద రూ.26.87కోట్లతో మంచినీటి పథకాలకు, రూ.37.50కోట్లతో నిర్మించే వందపడకల ఆసుపత్రికి, రూ.42.10కోట్లతో నిర్మించే వైరా కుడి, ఎడమకాల్వల ఆధునీకరణ పనులకు వైరాలో శంకుస్థాపన చేస్తారు. అతర్వాత తమ స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం వద్ద వైరా నదిలో రూ.7.67కోట్లతో నిర్మించే రక్షణ గోడల నిర్మాణానికి అలాగే రూ.4.67కోట్లతో నిర్మించే చెక్‌డ్యాం నిర్మాణానికి, రూ.66లక్షలతో నిర్మించే స్నానఘట్టాలకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేస్తారు. ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలపై భట్టి విక్రమార్క అధికారులతో సమీక్షించారు. భట్టి విక్రమార్క పర్యటన విజయవంతం కోసం గురువారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. భట్టి పర్యటన విజయవంతం చేయాలని కోరారు.

జోడెద్దుల్లా సంక్షేమం, అభివృద్ధి

- 100 రోజుల్లోనే ఐదు గ్యారెంటీల అమలు
- 15న రూ.2లక్షల రుణమాఫీ అమలు
- ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో గత ప్రభుత్వం లక్షల కోట్లు వృథా చేసింది
- తక్కువ ఖర్చుతో 'సీతారామ' పూర్తిచేస్తాం
- 1.75 లక్షల ఎకరాలను స్థిరీకరిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- యాతాలకుంట వద్ద టన్నెల్‌లో . 'సీతారామ' పనుల పరిశీలన


టన్నెల్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

సత్తుపల్లి, ఆగస్టు 8: ఇందిరమ్మ రాజ్యంలో జోడెడ్లలాగా అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తూ రైతును రాజును చేస్తామన్న హామీ మేరకు సుమారు రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద నిర్మితమవుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను గురువారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి పరిశీలించారు. టన్నెల్ లోపలికి వెళ్లి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సంబంధిత అధికారులతో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నిబద్ధతతో ఆరు గ్యారంటీలు ఇస్తామని చెప్పి 5 గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి భారమైనప్పటికీ రూ.2లక్షల రైతు రుణమాఫీని ఆగస్టు 15న అర్హులందరికీ అమలు చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులను, ఆసరా పింఛన్లను అందిస్తామన్నారు. రాజీవ్‌సాగర్, ఇందిరా సాగర్ టెండర్లను మార్చిన తర్వాత రూ.18 వేల కోట్లతో ప్రారంభించిన సీతారామ ప్రాజెక్టు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అదించనుండగా, రీడిజైన్ పేరుతో ఆనాటి ప్రభుత్వం గొప్పలు, ఆర్భాటాలకు పోయి రీడిజైన్ పేరుతో పేదోడి సొమ్మును దుర్వినియోగం చేశారన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజీవ్‌సాగర్, ఇందిరా ప్రాజెక్టులు చేపట్టి రూ.24కోట్లలో సుమారు రూ.1100 కోట్లను ఖర్చు చేయగా బీఆర్ఎస్ ప్రభుత్వం మోటార్లు, పైపులను స్క్రాప్ చేశారన్నారు. తమ ప్రభుత్వం వీలైనంత పొదుపు చేస్తూ సీతారామ ప్రాజెక్టును త్వరలో పూర్తి చేస్తుందన్నారు. గిరిజన ప్రాంతంలో ప్రతి ఎకరానికి సీరు ఇచ్చేందుకు పనులు చేపట్టామన్నారు. ఆనాటి ప్రభుత్వం రూ.8వేల కోట్లు ఖర్చుచేస్తే, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.550 కోట్లు పేమెంట్ చేసి, నిద్రబోతున్న కాంట్రాక్టర్లను మేల్కొలపడం జరిగిందన్నారు. నాగార్జున సాగర్ ఆయకట్టులో వైరా ప్రాజెక్టుకు అప్‌స్ట్రీమ్ నుంచి సీతారామ ప్రాజెక్టుకు లింక్ కెనాల్ కలిపి సుమారు 1.75 లక్షల ఎకరాలను స్థిరీకరించడం కోసం సుమారు రూ.93 కోట్ల ఖర్చుతో 9.6 కిలోమీటర్ల ఏన్కూర్ వద్ద లింక్ కెనాల్‌ను నిర్మిస్తున్నామన్నారు. భగవంతుడు అనుకూలిస్తే ఈనెల 15వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించుకోనున్నట్లు చెప్పారు.

రెవెన్యూ చట్టాన్ని ఈ దేశానికి ఒక మోడల్‌గా తేస్తామని, రాష్ట్రంలో భూమి ఉన్న ప్రతిఒక్కరి కోసం చట్టాన్ని ప్రజల అభిప్రాయంతో సవరించనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి మూడు నెలల్లోపు ఆమోదిస్తామన్నారు. 'మేం అధికారంలోకి వచ్చి 7 నెలలే అవుతోంది.. మీలాగా పదేళ్లు పరిపాలించలేదు.. కాంగ్రెస్ పార్టీ వచ్చిందని, రైతులు, చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని గత పాలకులు అంటున్నారు.. కానీ మీరు చేసిన పాపాలు, శాపాలు, రైతన్నలను పెట్టిన ఇబ్బందుల ఫలితమే నేటి రైతన్నల ఆత్మహత్యలు... మా ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు ఇప్పుడు పంటలు వేసుకుంటున్నారు... మీ పాపాలను తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీపై రుద్దడం, అసెంబ్లీలో మాట్లాడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు..' అని పొంగులేటి బీఆర్ఎస్ నేతలను దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఇరిగేషన్ డవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ మువ్వ విజయబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి తప్పిన ప్రమాదం

- ప్రయాణిస్తుండగా కారు టైరుకు పంక్చర్
- అప్రమత్తంగా వ్యవహరించి వాహనాన్ని నిలిపివేసిన డ్రైవర్
- ఏలూరు జిల్లాకు వెళుతుండగా ఘటన

7

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

- వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి
- ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లివాలి
- సీసీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

కొత్తగూడెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.2లక్షల రైతురుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. వర్షాలకు నష్టపోయిన పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి తగిన పరిహారం అందించాలని కోరారు. కొత్తగూడెం క్లబ్‌లో గురువారం పార్టీ భద్రాద్రి జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హైజరైన తమ్మినేని మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి, మొక్కజొన్న, మిర్చి, వరి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గోదావరి వరదలతో నష్టపోయిన వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, వర్షాలు తగ్గేవరకు పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేయాలని కోరారు. ఇళ్లు కోల్పోయిన ప్రజలకు మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలన్నారు. నిబంధనల పేరుతో కొద్ది మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారని, షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ కల్పించాలని కోరారు. గోదావరి వరదల నుంచి భద్రాచలం ప్రజలను శాశ్వత రక్షణ కల్పించేందుకు కరకట్ట నిర్మాణం పూర్తి చేయాలన్నారు.

భద్రాచలం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ బొగ్గుబ్లాకుల వేలానికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ అఖిలపక్ష రాజకీయ పార్టీలను కలుపుకుని కేంద్ర ప్రభుత్వంపై పోరాటంచేయాలన్నారు. సీతారామ ప్రాజెక్ట్ మొదటి డిజైన్ ప్రకారమే ఉమ్మడి జిల్లాకు సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. వరద సహాయ చర్యల్లో సీపీఎం శ్రేణులు పాల్గొని ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. వాయ్‌నాడ్ వరద బాధితులకు విరివిగా విరాళాలు సేకరించి పంపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సీనియర్ నాయకులు కాసాని అయిలయ్య, యలమంచిలి రవికుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఎజే. రమేష్, ఎంబి. నర్సారెడ్డి, ఎం.జ్యోతి, లిక్కి బాలరాజు, కే.బ్రహ్మాచారి, పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

గోదావరి తగ్గుముఖం

భద్రాచలం, ఆగస్టు 8: భద్రాచలం వద్ద గత 24 గంటల్లో స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం మళ్లీ తగ్గుముఖం పట్టింది. బుధవారం 34.6 అడుగులున్న గోదావరి నీటిమట్టం గురువారం ఉదయం 10 గంటలకు 38.6 అడుగులకు పెరిగింది. అనంతరం రెండు గంటలపాటు నిలకడగా ఉండి క్రమేపీ తగ్గుతూ వచ్చింది. ఈ క్రమంలో రాత్రి 7 గంటలకు 37.4 అడుగులకు చేరింది. శుక్రవారం గోదావరి స్వల్పంగా తగ్గే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.



అందుబాటులో తపాలా సేవలు

జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి

దమ్మపేట, ఆగస్టు 8 : మారుతున్న టెక్నాలజీకి అణుగుణంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తపాలా సేవలు అందుబాటులోకి తేవటం జరిగిందని జిల్లా సూపరింటెండెంట్ వీరభద్రస్వామి అన్నారు. మల్కారం పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం పాల్వంచ ఎస్‌డీఐపీ రమేష్ నాయక్ అధ్యక్షతన డీసీడీపీ (డాక్ కమ్యూనిటి డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమంలో భాగంగా తపాలా శాఖ ద్వారా అందిస్తున్న పొదుపు పథకాలు, సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో పోస్టల్ సేవలు కీలకమయ్యాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పథకాన్ని పోస్టల్‌శాఖ ద్వారానే అమలు చేస్తున్నాయన్నారు. జిల్లాలో 820 బ్రాంచి తపాలా కార్యాలయాలు, 62 ఉపతపాలా కార్యాలయాల ద్వారా సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలని, పొదుపు పథకాలు వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఎస్పీఎం దేవకుమారి, మెయిల్ ఓవర్‌సీర్ శేషు, బీపీఎం సత్యనారాయణ, కార్యదర్శి శివ గ్రామస్తులు అంకత మహేశ్వరరావు, ప్రసాదు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గానకోకిల పురస్కారానికి
దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంటౌన్, ఆగస్టు 8: తమ పాటలతో ప్రజలను చైతన్యపరిచిన ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమ గాయకులకు ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ సంస్థ తరపున గానకోకిల పురస్కారం ప్రదానం చేయనున్నట్టు నిర్వహణ కమిటీ కన్వీనర్ కోమాకుల సీతారాములు, కో కన్వీనర్ కొమిరి సాకీ, అరుణోదయ నిర్మల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన గాయనీ గాయకులు ఈనెల 12వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారులు తమ ప్రోగ్రాంకు సంబంధించిన పేపర్ క్లిప్పింగ్, ఫొటోలు, వచ్చిన సర్టిఫికెట్లు 8374793374, 99088 04755 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు. ఎంపిక చేసిన గాయకులకు ఈనెల 18న ఖమ్మంలో గానకోకిల పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాలు అందజేస్తామని నిర్వహణ కమిటీ వారు పేర్కొన్నారు.

వర్షపు నీటిని ఒడిసిపట్టాలి..


- ప్రతీ ఇంట్లో ఇంకుడుగుంత తప్పనిసరి
- విద్యానగర్‌లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పరిశీలన...
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

చుంచుపల్లి, ఆగస్టు 8: భూగర్భజలాలు పెంపొందించుకొనేందుకు ప్రతీ ఇంట్లో ఇంకుడుగుంత తప్పనిసరిగా నిర్మించుకోవాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. గురువారం చుంచుపల్లి మండలంలోని విద్యానగర్‌కాలనీ గ్రామ పంచాయతీలో నిర్మించిన ఇంకుడు గుంత నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఇంకుడు గుంత నిర్మించి, వర్షపు నీటిని ఒడిసిపెట్టి భూగర్భజలాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రతీ భవనంపై పడిన వర్షపు నీటిని ఒడిసిపట్టాలన్నారు. ప్రభుత్వం బిల్లింగ్‌లకు గాని... ప్రైవేటు బిల్డింగ్‌కు గాని, ప్రతీ ఒక్కరు వీటిని నిర్మించి భావితరాల భవిష్యత్తుకు బాటలు వేయాలని తెలిపారు. అదేవిధంగా వినూత్న ఆలోచనతో ఏర్పాటు చేసిన పిచ్చి గడ్డి తొలగించే యంత్రాన్ని పరిశీలించారు. ఈ విధానం బాగుందని.. ఈ యంత్రాన్ని అందరూ ఉపయోగించే విధంగా అవగాహన కల్పించాలని తెలియజేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనస మొక్కను నాటి, మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ మొక్కలతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, చుంచుపల్లి తహసీల్దార్, విద్యానగర్ ప్రత్యేక అధికారి పానెం కృష్ణ, ఎంపీడీవో అశోక్‌కుమార్, ఎంపీవో సత్యనారాయణ, ఈజీఎస్ ఈసీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం
గడువు పొడిగింపు: సీఎండీ బలరాం

కొత్తగూడెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ సామాజిక బాధ్యతతో చేపట్టిన రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్టు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరాం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువత సివిల్స్, ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధిస్తే సింగరేణి తరఫున లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఈ నెల 20న ఈ పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకంలో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 6వ తేదీ వరకు గడువు విధించడం జరిగింది. అయితే గడువు పొడిగించాల్సిందిగా అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నెల 12వ తేదీ పెంచినట్టు ఆయన తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సింగరేణి వెబ్‌సైట్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.


సీఎండీ బలరాం

రూ.23 కోట్లు బకాయిలు చెల్లించాలి

సీడీఎంఏ డైరెక్టర్‌కు కాంట్రాక్టర్ల వినతి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 8: కేఎంసీలో గతేడాది కాలంలో స్పెషల్ డెవలప్‌మెంట్ పథకం ద్వారా ఖమ్మం నగరానికి రూ.60 కోట్లు మంజూరు జరిగితే వాటిలో రూ.23 కోట్ల పనులు పూర్తి చేశామని, కాని వాటి డబ్బులు మాత్రం ప్రభుత్వం చెల్లించలేదని సీడీఎంఏ డైరెక్టర్ వీపీ గౌతమ్‌కు కాంట్రాక్టర్లు వినతిపత్రం అందించి తమ గోడు తెలిపారు. పనులు నిర్మాణంపై అడ్మిన్ శాంక్షన్ పూర్తి జరిగిందని పనులు పూర్తి జరిగిన తర్వాత ఫైనాన్స్ ఎల్‌వోసీ రాకపోవటంతో తమకు రావాల్సిన బిల్లులు నిలిచిపోయాయని విన్నవించారు. తమ వద్ద ఉన్న డబ్బులు మొత్తం పెండింగ్ బిల్లుల రూపంలో నిలిచిపోవటంతో కేఎంసీలో పనులు చేసేందుకు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కేఎంసీ కాంట్రాక్టర్లు బండి సతీష్, పసుపులేటి వెంకటేశ్వరరావు, జోగుల కిషోర్, పాలకుర్తి కృష్ణ, తుమ్మలపల్లి వీరభద్రం, గట్టికొప్పుల వీరారెడ్డి, దండిగల రాంబాబు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

ఒకే కుటుంబంలో ఇద్దరు ఇంజనీర్లు

ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల్లో సోదరీమణులకు కొలువులు

బోనకల్, ఆగస్టు 8: కృషి, పట్టుదల, క్రమశిక్షణ తోడుంటే లక్ష్యాలు సులువుగా సాధించవచ్చునని వారు నిరూపించారు. తెలంగాణా పబ్లిక్ సర్వీస్ కమీషన్ విడుదల చేసిన ఫలితాల్లో ఒకే ప్రయత్నంలో ఒకే కుటుంబంలోని ఇద్దరూ ఒకేసారి ఇంజనీర్లుగా ఎంపిక కావడం ఆదర్శప్రాయంగా చెప్పుకోవచ్చు. మండలంలోని చిరునోముల ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పని చేస్తున్న కాంపాటి వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె కృష్ణ కుమారి బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ విద్యను ఖమ్మంలోని కిట్స్ కళాశాలలో పూర్తి చేసింది. పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షలు రాయగా ఆర్‌అండ్‌బీ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎంపికైంది. చిన్న కుమార్తె సాయి శీరిష జేఎన్‌టీయూ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసి పరీక్షలు రాయగా ఇరిగేషన్‌శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎంపికైంది. అక్కాచెల్లెళ్లు ఇంజనీర్లుగా ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయుడి కుటుంబంలో సంతోషం నెలకొంది. ఇద్దరూ ఇంజనీర్లుగా ఎంపిక కావడం పట్ల యూటీఎఫ్, పీఆర్‌టీయూ నాయకులు వల్లంకొండ రాంబాబు, జి.రామకృష్ణ, కొనకంచి రామ్మోహన్, చింతల రవి కుమార్‌లు అభినందించారు.


కృష్ణ కుమారి


సాయి శీరిష

తప్పులు సవరించి రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలి
- ఆరు గ్యారెంటీలు తక్షణమే అమలు చేయాలి
- కలెక్టరేట్‌ను ముట్టడించిన సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్
- అదనపు కలెక్టర్‌కు వినతి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 8: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ కల్లబొల్లి హామీలను ఇచ్చిందని వాటిని 100 రోజుల్లోనే అమలు చేస్తామని చెప్పి ప్రజల్ని మోసం చేసిందని, ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన ఆరు గ్యారెంటీ పథకాలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం ఖమ్మం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. పదుల సంఖ్యలో సంక్షేమ పథకాల దరఖాస్తుదారులతో వీవీపాలెం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన నిరసన సభలో గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామని నమ్మబలికిందన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేస్తామని నేటి వరకు అమలు చేయలేదని ఆరోపించారు. నూతనంగా ఆసరా పింఛన్లు మంజూరు చేయలేదని, కనీసం రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను ప్రారంభించలేదన్నారు. అధికారంలోకి వచ్చి 7 నెలలు పూర్తయినా ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదని అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాలు ప్రారంభించామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాటలు చెప్పి కాలం వెల్లదీయటంతో ప్రజలు ఇంటికి పంపారని, అటువంటి ప్రజాగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం రాకుండా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీలో తప్పిదాలను సరిచేసి అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలని కోరారు. పోడు సాగుదారులందరికీ పట్టాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.12వేలను ఇవ్వాలని ఇందుకోసం లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తే ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కూడా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతి పత్రం అందించారు. నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య, జీ రామయ్య, కే అర్జున్‌రావు, ఆవుల అశోక్, బందెల వెంకన్న, కమ్మకోమటి నాగేశ్వరరావు, కోల్లేటి నాగేశ్వరరావు, మలీదు నాగేశ్వరరావు, కే వెంకన్న, సీహెచ్ శిరోమణి, మంగతాయి, లలిత, లాల్మీయా, కే శ్రీను, శోభ, లాజర్, ఆజాద్, శరత్, రాందాస్, రాకేష్, ప్రేమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కొండకోనల నడుమ కన్నీటిపాయ

● దశాబ్దాలు గడుస్తున్నా మారని ఆదివాసీల బతుకులు ● నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

భద్రాచలం, ఆగస్టు 8 : ఏజెన్సీ ప్రాంతంలోనే నివసించడానికి ఇష్టపడే ఆదివాసీలు అడవులనే ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తుంటారు. దీనికి కారణం లేకపోలేదు. పోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ, జంతువుల వేట, ప్రశాంత వాతావరణం, కల్లాకపటం లేని మనస్సులు, పరస్పర సహాయం అందించుకునే నైజం వారికే సొంతం. దీంతో అడవి తల్లి ఒడిలోనే వారి బతుకు పయనం సాగుతోంది.

అభివృద్ధి ఇంకెప్పుడు....!

ఆదివాసీల అభివృద్ధి కోసం కేంద్ర రా ష్ట్ర ప్రభుత్వాలు అంతంత మాత్రంగానే కేటాయింపులు చేస్తున్నాయనే విమర్శలు ఆదివాసీ సంఘాల నాయకుల నుంచి లేకపోలేదు. కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో వారి దరిచేరడం లేదని ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా 1975 మార్చి 12న ఆదివాసీల బతుకుల్లో వెలుగులు నింపేందుకు ఖమ్మం జిల్లా కేంద్రంలో ఐటీడీఏను ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం 1979 డిసెంబర్ 17న పాల్వంచకు , 1993 ఫిబ్రవరి 9 నుంచి భద్రాచలం కేంద్రంగా ఐటీడీఏ కార్యాకలపాలు సాగుతున్నా గిరిజనుల బతుకుల్లో ఆశించినస్థాయిలో అభివృద్ధి లేదన్నది జగమెరిగిన సత్యం.

ఆదివాసీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు వివిధ ప్రభుత్వాల హాయంలో వచ్చినా అర్హులైన వారికి పూర్తిగా అవి దక్కకపోవడం, కొన్ని చోట్ల అర్హుల పేరిట బినామీలు వాటిని చేజిక్కించుకోవడంతో వారి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారిందని ఆదివాసీ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. నేటికి ఏజెన్సీలోని అధికశాతం గ్రామాల్లో పూరిపాకల్లోనే వారి జీవనం సాగుతుండటంతో పాటు, గుట్టలపై నివసిస్తున్న వారి పరిస్థితి వర్ణనాతీతం. ఇదే సమయంలో సురక్షితమైన తాగునీరు, సకాలంలో వైద్యం అందక ఏటా ఇబ్బందులు పడుతున్న వారు అనేకం.

మాతా శిశు మరణాలు

ఏజెన్సీని మాతా శిశు మరణాలు వీడటం లేదు. పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాతా శిశు మరణాలు అధికారులను కొంత కలవరంకు గురి చేస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం ఆదివాసీల్లో బాల్య వివాహాలు, పోషకాహార లోపం, సమయానికి వైద్యం, మందులు అందకపోవడం కూడా కారణంగా తెలుస్తోంది.

రహదారులు లేని గ్రామాలెన్నో

ఏజెన్సీలో ఇంకా రహదారి సౌకర్యం లేని ఆదివాసీ గ్రామాలు ఉన్నాయి. ఆళ్లపల్లి మండలంలో అడవి రామవరం, పాతూరు, కర్నెగూడెం, చంద్రాపురం, రాయగూడెం, దొంగతోగు, ఊసురాయి, సింగారం, వెంకటాపురం గ్రామాలకు నేటికి రాకపోకల సౌకర్యం లేదు. అలాగే చర్ల మండలంలో బత్తినపల్లి రామచంద్రునిపేట కొరకట్‌పాడు, బట్టిగూడెం గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. గుండాల మండలంలో మాటములంక, పెద్దతోగు, లక్ష్మీదేవిపల్లి, కన్నాయిగూడెం, ఇప్పాలగుంపు, మల్లెవారి గుంపులకు ఇదే సమస్య. ఇలా చెప్పుకుంటూ పోతే ఏజెన్సీలోని పలు మండలాల్లో రహదారి సౌకర్యం లేని గ్రామాలు ఉండటం అత్యంత బాధకరం.

వర్షాకాలంలోఆ గ్రామాల్లో నివసించే వారికి ఆరోగ్యపరంగా ఏదైనా సమస్య వస్తే వారి బాధలు వర్ణనాతీతం. అంతెందుకు ఇటీవల ఆళ్లపల్లి మండల పరిధిలోని చంద్రాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి చనిపోతే రహదారి సౌకర్యం లేకపోవడంతో జిల్లేరు వాగు అడ్డుగా ఉండటంతో ఏ వాహనం వెళ్లే పరిస్థితి లేదు. దీంతో కావడి కట్టుకొని మృతదేహాన్ని రాత్రి సమయంలో చంద్రాపురం గ్రామస్తులు తీసుకెళ్లడం అత్యంత బాధాకరం. ఇదిలా ఉండగా ఊరవాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక పైపు కల్వర్టు తెగిపోవడంతో రాయిగూడెం గ్రామస్తులే ఇసుక బస్తాలతో రోడ్డు ఏర్పాటు చేసుకున్న దుస్థితి. ఈ విషయంపై అధికారులకు చెప్పినా స్పందన లేకపోవడంతో వారు స్వయంగా తాత్కాలికంగా రహదారి నిర్మించుకున్నారు.


జల్లేరుదాటుతున్న కన్నెగూడెం గిరిజనులు(ఫైల్‌ఫోటో)

స్వయం ప్రతిపత్తి కలేనా..?

ఆదివాసీలు దశాబ్దాల కాలంగా తమకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. సంఘాలు వేరైనా అంతర్లీనంగా వారి నినాదం మాత్రం ఒక్కటే. ఏజెన్సీ ప్రాంతంలో తమ పాలనే సాగాలని ఇందుకు ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి అధికారం ఇవ్వాలని వారు ఆకాంక్షిస్తున్నారు. కాని వారి ఆశ నేటి వరకు నెరవేరలేదు. ఇందు కోసం గత కొన్నాళ్లుగా వివిధ రూపాల్లో వారు తమ పోరాటాలను సాగిస్తున్నా తాత్కాలిక ఉపశమనమే తప్ప శాశ్వతంగా వారికి ఊరటనిచ్చే భరోసా కరువైందనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

నగరంలో సీడీఎంఏ డైరెక్టర్ గౌతమ్ పర్యటన

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 8: ఖమ్మం పూర్వ కలెక్టర్, రాష్ట్ర మునిసిపల్ పరిపాలన డైరెక్టర్ వీపీ గౌతమ్ రెండు రోజులు ఉమ్మడి జిల్లాలో పర్యటనకు గాను గురువారం ఖమ్మానికి చేరుకున్నారు. ఎన్ఎస్‌పీ అతిథి గృహంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య విడి విడిగా పుష్పగుచ్ఛాలను వీపీ గౌతమ్‌కు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మేయర్ నీరజ... వీపీ గౌతమ్‌తో 30నిమిషాల పాటు సమావేశమైనారు. కేఎంసీలో పెండింగ్ బిల్లులు, నిధులు కొరత, డంపింగ్‌యార్డు ఇబ్బందులు ఇతర సమస్యలపై డైరెక్టర్‌కు విన్నవించారు.

అనంతరం కమిషనర్‌తో కలిసి వీపీ గౌతమ్ ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. వైరల్, డెంగ్యూ జ్వరాల వ్యాప్తిపై విద్యార్థులు, మెప్మా ఆర్పీలకు అవగాహన కల్పించారు. కేఎంసీ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార కరపత్రాలను పరిశీలించి బాగుందని మెచ్చుకున్నారు. జన సంచార ప్రదేశాల్లో దోమల నియంత్రణపై కరపత్రాలు, స్లైడ్స్ ద్వారా అవగాహన కల్పించాలని కమిషనర్ అభిషేక్ అగస్త్యకు సూచించారు.

అనంతరం విద్యార్థులు, ఆర్‌పీలతో కలిసి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి స్టేడియం వరకు ర్యాలీలో గౌతమ్ పాల్గొన్నారు. ఖమ్మంలోని డంపిం గ్ యార్డుకు వెళ్లి అక్కడ సమస్యలను కమిషనర్, సహాయ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. డంపిగ్ యార్డులో నిర్వహిస్తున్న 2.5టన్నుల బయో మైనింగ్ వ్యర్థాల ప్రక్రియను పరిశీలించారు. ఎంత కాలానికి పూర్తి జరుగుతందని నిర్వాహకులతో మాట్లాడి తెలుసుకున్నారు.

తర్వాత ప్రభుత్వ వైద్య కాలేజీలో మొక్కలను నాటారు. రెండో సంవత్సరం వైద్య విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం కేఎంసీలో కమిషనర్ అభిషేక్ అగస్త్య అధ్యక్షతన అధికారుల సమావేశంలో రివ్యూ చేపట్టారు. గతంలో గ్రీన్ సిటీ అవార్డు ఖమ్మానికి వచ్చిందని, దానిని కొనసాగిస్తూ పచ్చని సుందర ఖమ్మంగా మొక్కలు పెంచాలని సూచించారు.

నేటి పర్యటన వివరాలు

సీడీఎంఏ డైరెక్టర్ గౌతమ్ శుక్రవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు గురువారం ఖమ్మంలోని ఎన్ఎస్‌పీ అతిథిగృహంలో బస చేశారు. ఉదయం వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీల్లో నిర్వహించే స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాల్లో పాల్గొంటారు.

నీకులంతా తెలుసు చూసుకో..

సీడీఎంఏ డైరెక్టర్ గౌతమ్.. కమిషనర్‌తో కలిసి మంత్రి తుమ్మలను క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మూడేళ్ల పాటు ఖమ్మం నగర అభివృద్ధి కోసం కష్టపడ్డావు. ఇంకా ఏమేం కావాలో నీకు తెలుసు.. అంతా నీవే చూసుకో గౌతమ్ అంటూ సూచించారు. ఈ సందర్భంగా గౌతమ్.. ఖమ్మం కమిషనర్ అభిషేక్ అగస్త్యకు మేయర్ నీరజను పరిచయం చేశారు. అభివృద్ధిలో అధికారులకు అన్ని విధాలా సహకరిస్తారని తెలిపారు.


. మంత్రి తుమ్మలను కలిసిన సీడీఎంఏ డైరెక్టర్ వీపీ గౌతమ్


ఖమ్మంలో డంపింగ్ యార్డు వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న డైరెక్టర్ వీపీ గౌతమ్

ప్రభుత్వ స్థలాలకు కంచెలు వేయండి..

- ఇందిరమ్మ ఇళ్లకు స్థలాలు చూడండి
- అధికారులకు మంత్రి తుమ్మల

ఖమ్మం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని, ఇందిరమ్మ ఇళ్లకు స్థలాలు చూడాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభ వైరాలో ఉన్నందున ఖమ్మం నగరాన్ని కూడా ముస్తాబు చేయాలని సూచించారు. గురువారం ఖమ్మం వచ్చిన రాష్ట్ర హౌజింగ్ కమిషనర్, మునిసిపల్ శాఖ కమిషనర్ వీపీ గౌత మ్, ఖమ్మంకలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తుమ్మల అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ భూములను సంరక్షించడంతో పాటు ప్రభుత్వ, ప్రజా అవసరాల కోసం వినియోగించాలని సూచించారు.

ఖమ్మం నగరంతో పాటు రఘునాధపాలెం మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. వీటికి సంబంధించిన వాటిని ఫెన్సింగ్ వేసి బందోబస్తు చేయాలని ఆదేశించారు. గోళ్లపాడు చానల్ పెండింగ్ పనులను నాణ్యతతో పూర్తిచేయాలని,వెలుగుమట్ల అర్బన్ పార్కు ను ఏకో టూరిజం పార్కుగా అభివృద్ధి పరచాలని సూచించారు. పార్కుకు వెళ్లే దారిలో డబుల్‌రోడ్డు పనులు చేపట్టాలని కోరారు. జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని, నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో డివైడర్లలో మొక్కలు వేయడంతో పాటు అందంగా తీర్చిదిద్దాలన్నారు. ఖమ్మంలో మరో ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన స్థలాలు చూడాలని కోరారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా అధికార యంత్రాంగం కృషిచేయాలని సూచించారు. ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజతో పాటు ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు జలకళ

- పొంగి పొర్లుతున్న ఏర్లు, వాగులు
- నిండుకుండల్లా చెరువులు, జలాశయాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్నరైతులు

ఖమ్మం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతిప్రతినిధి): గత మూడు రోజుల్లో కురిసిన భారీ వర్షాలతో ఉమ్మడి జిల్లాకు జలకళ వచ్చింది. వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు కొంత నిరాశాజనకంగా ఉన్నా క్రమంగా పుంజుకోవడంతో ఇరు జిల్లాల్లోని జలాశయాలు నిండుకుండల్లా మారాయి. వాగులు, ఏర్లు పొంగి ప్రవహిస్తుండడంతో రైతు లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గత సంవత్సరం నిరాశపరిచిన నాగార్జునసాగర్ ఈసారి ముందుగానే నిండడంతో ఎన్నడూ లేనిది ఆగస్టులోనే కృష్ణమ్మ జిల్లా ఆయకట్టుకు పరుగున వచ్చింది. ఈ క్రమంలో గత మూడు రోజుల్లో కురిసిన వర్షాలతో జిల్లాలోని అన్ని ప్రాజెక్టులు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో రైతులు సాగు పనులు ముమ్మం చేశారు. పాలేరు ఎడమ కాల్వకు నీరు వదలడంతో ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని రెండున్నర లక్షల ఎకరాలు ఈసారి పంటలతో కళకళలాడనున్నాయి. పాలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23అడుగులకు గాను 19 అడుగులకు చేరడంతో రోజు 3వేల క్యూసెక్కుల నీరు ఆయకట్టుకు వదులుతున్నారు. వైరా, లంకాసాగర్, బేతుపల్లి, జాలిముడి ప్రాజెక్టులు కూడా అలుగు పారుతున్నాయి. ఎగువన కురిసిన వర్షాలతో ఖమ్మంలో మున్నేరు పొంగి ప్రవహిస్తోంది. వైరా, కట్టలేరు, కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జలాశయాలన్నీ నీటితో కళకళలాడుతుండడంతో రైతులు వరినాటు పనులు ముమ్మరం చేశారు.


మున్నేరు నది

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు

● వివరాలను వెల్లడించిన ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో తెలంగాణ, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన ఇద్దరు మావోయిస్టు దళ సభ్యులు లొంగిపోయారు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ గురువారం లొంగిపోయిన మావోయిస్టు వివరాలను వెల్లడించారు. తెలంగాణ మావోయిస్టు పార్టీ శబరి ఏరియా కమిటీ సభ్యుడైన వెట్టి లక్ష్మయ్య అలియాస్ కల్లు, చత్తీస్‌గఢ్ త్తీస్‌గడ్ మావోయిస్టు పార్టీ గొల్లపల్లి ఎల్‌వోఎస్ సభ్యుడైన మల్లం దేవా పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో వెట్టి లక్ష్మయ్య అలియాస్ కల్లు భద్రాద్రి జిల్లా చర్ల మండలం కిష్టారం పాండు గ్రామానికి చెందిన వ్యక్తి.. ఇతడు 2021లో మావోయిస్టు పార్టీ చర్ల శబరి ఏరియా మిలీషియా కమాండర్ వద్ద సభ్యుడిగా చేరాడు. 2022లో దళ సభ్యుడిగా పదోన్నతి పొంది కొన్ని రోజులు ఆజాద్‌కు సెక్యూరిటీ గార్డుగా పని చేశాడు. తర్వాత కొన్ని రోజులు చర్ల ప్లాటూన్‌లో దళసభ్యుడిగా కొనసాగాడు. 2023లో శబరి ఏరియాకు బదిలీ అయ్యి ఇప్పటి వరకు ఆ ఏరియా దళసభ్యుడిగా కొనసాగుతున్నాడు. ఇక మరో మావోయిస్టు దళ సభ్యుడు మల్లం దేవా 2007 నుంచి 2015వరకు మావోయిస్టు పార్టీకి చెందిన బాలల సంఘంలో పనిచేశాడు. 2015లో గొల్లపల్లి ఎల్‌వోఎస్ మిలీషియా కమాండర్ వద్ద సభ్యుడిగా చేరాడు. 2017లో మిలిషియా సభ్యుడిగా పదోన్నతి పొందాడు. 2020 నుంచి చత్తీస్‌గడ్‌లోని గొల్లపల్లి ఎల్‌వోఎస్ దళసభ్యుడిగా పని చేస్తున్నాడు. వీరిద్దరు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు. మావోయిస్టు పార్టీనాయకులు వేధింపులు భరించలేక చాలామంది దళ సభ్యులు లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నారని, జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన ఆపరేషన్ చేయూత కార్యక్రమంతో మావోయిస్టులో పని చేస్తున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని అందులో భాగంగానే వీరిద్దరు లొంగిపోయినట్లు తెలిపారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం జీవనోపాధి, పునరావాసం కల్పిస్తుందన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

విజృంభిస్తున్న జ్వరాలు

- ఇంటికి నలుగురైదుగురు చొప్పున జ్వరాలతో విలవిల
- జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- అడ్రస్‌లేని బ్లీచింగ్, దోమలమందు పిచికారి
- వైద్యం కోసం పట్టణాలకు పరుగులు పెడుతున్న రోగులు

అశ్వారావుపేట, ఆగస్టు 8: అశ్వారావుపేట మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరపీడితులతో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిటలాడిపోతున్నాయి. గ్రామాలలో ఇంటింటికీ నలుగురైదుగురు చొప్పున జ్వరాల భారీన పడి విలవిలలాడిపోతున్నారు. జ్వరాలు వచ్చినవారికి ఒళ్లు, కాళ్ల నొప్పులతో నడవలేని పరిస్థితిలో ఉన్నారు. దీంతో ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. కొందరు స్థానికంగా ఉన్న వైద్యులతో, అవకాశం ఉన్నవారు ప్రభుత్వ వైద్యశాలలకు వైద్యం కోసం వెళుతున్నారు.


ఓ ప్రైవేటు వైద్యశాలలో వైద్యం చేయించుకుంటున్న దృశ్యం

మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో అత్యంత దారుణమైన పరిస్థితుల్లో జ్వరపీడితులు కనిపించారు. గ్రామాలలో దోమల మందు పిచికారి, బ్లీచింగ్ ఆచూకీనే లేకుండా పోయాయి. దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వ వైద్యం అంతంత మాత్రంగానే అందుతుంది. జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వైద్యం చేయాల్సిన ఉండగా, అప్పుడప్పుడు గ్రామంలోకి వెళ్లి రక్తపూత సేకరణ, కొద్దిగా మాత్రలు ఇచ్చి సరిపెడుతున్నారు. జ్వరాలు తగ్గిన వారు కూడా 15 నుంచి నెల రోజుల కావస్తున్నా నొప్పులు, వాపులతో తమ పని తాము చేసుకోలేని పరిస్థితుల్లో జనం ఉన్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

ప్రతి ఇంట్లో జ్వరపీడితులు.....

మలేరియా ఎఫెక్టెడ్ గ్రామాలైన మండలంలోని రెడ్డిగూడెం, బండారిగుంపు, నారంగుంపు గ్రామాలను సందర్శించింది. రెడ్డిగూడెం గ్రామంలో ఎక్కడ చూసిన పాకుడు, తేమతో నిండి కనిపించింది. ఇప్పటి వరకు బ్లీచింగ్‌ను, దోమల మందును పిచికారి చేసిన పాపానపోలేదని గ్రామస్థులు చెప్పారు. ఈ గ్రామాలన్ని కొండరెడ్ల గ్రామాలు. ఇలా ఏ ఇంట్లో చూసిన జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామాల్లో సుమారుగా 100 కుటుంబాలు ఉండగా అందులో 90 కుటుంబాలకు పైగా ప్రతి ఇంట్లో జ్వరాలతో బాధపడుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కొండరెడ్ల కుటుంబాలు జ్వరాలతో విలవిలలాడిపోతున్నారు. ఇప్పటికే ప్రైవేటు వైద్యం కోసం వేలాది రూపాయలు వెచ్చించి అప్పుల పాలైపోతున్నామని వాపోతున్నారు.


అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో కిటకిట లాడుతున్న జ్వరపీడితులు

ఇటు అధికారులు గాని, అటు ప్రజా ప్రతినిధులు కానీ ఎవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేదని వాపోతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఫైసల్లేవంటూ గ్రా మాలలో బ్లీచింగ్‌ను కూడా చల్లకుండా చేతులెత్తేశారు. అధికారులు తక్షణమే స్పందించి గిరిజనులకు వైద్యంతో పాటు గ్రామ పరిసరాల్లో బ్లీచింగ్, దోమలమందు పిచికారి, పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జాతీయ రహదారులకు
ఇరువైపులా సర్వీస్ రోడ్లు

» జిల్లా సరిహద్దుల వరకు అంచనావేసి నివేదికలు ఇవ్వండి » మంత్రి తుమ్మల ఆదేశం

ఖమ్మం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం-విజయవాడ, నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదాలకు ఇరువైపులా జిల్లా సరిహద్దుల వరకు రైతులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేషనల్ హైవే అథారిటీ అధికారులను ఆదేశించారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం నేషనల్ హైవే అధికారులతో హైవేల పనులపై సమీక్షించారు. జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతున్నందున సరిహద్దుల వరకు సర్వీసు రోడ్లు నిర్మించేలా సమగ్రనివేదిక ఇవ్వాలని, ఆ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. అలాగే బోనకల్ రోడ్డులోని దంసలాపురం ఎగ్జిట్‌కు ఎంట్రీపాయింట్ నుంచి సర్వీసు రోడ్డుకు అనుమతి వచ్చిందని, త్వరలో పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. వైరాలో 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఉన్నందున ఖమ్మం-అశ్వారావుపేట రహదారిపై ఏర్పడిన గుంతలు వెంటనే పూడ్చివేయాలని సూచించారు.


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

నేటి నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

ఖమ్మంసాంస్కృతికం, ఆగస్టు 8: ఉభయ తెలుగురాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఈనెల 9వతేదీ నుంచి 11వరకు ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో జరుగనున్నాయి.. నెలనెల వెన్నెల, ఖమ్మం కళాపరిషత్, ప్రజానాట్య మండలి సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో ఈ నాటిక పోటీలు ఏర్పాటు చేశారు. నాటికల్లో ఉత్తమమైన వాటిని పోటీలకు ఆహ్వానించారు. ప్రతిరోజూ మూడు నాటికల చొప్పున పోటీల్లో ప్రదర్శిస్తారు. 9వ తేదీ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరవ్వనుండగా, 10న రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, 11న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి తదితర అతిథులు పాల్గొంటారు.

వైరా అభివృద్ధికి బాటలు

● నేడు రూ.119కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న డిప్యూటీ సీఎం భట్టి

వైరా, ఆగస్టు 8: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన స్వస్థలమైన వైరా ప్రాంత అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. గత ఏడాది నవంబరులో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటమే కాకుండా వైరాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా మాలోతు రాందాస్‌నాయక్ విజయం సాధించడం, తాను ఉపముఖ్యమంత్రే కాకుండా, ఆర్థిక ప్రణాళికశాఖలను కూడా భట్టి విక్రమార్క నిర్వహిస్తుండటంతో తొలిసారి వైరా అభివృద్ధికి తనవంతు బాటలు వేస్తున్నారు. శుక్రవారం రూ.119కోట్లకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేసి తన మార్క్‌ను చాటుకోబోతున్నారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ విజ్ఞప్తి మేరకు అధికారులతో ప్రణాళికలను సిద్ధం చేయించి వైరా నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వ ఎజెండాగా తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. సీతారామ ప్రాజెక్టు నుంచి రాజీవ్‌సాగర్ లింక్ కెనాల్ ద్వారా వైరాకు గోదావరి నీళ్లు తీసుకువచ్చే కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. ఈనెల 15న గోదావరి జలాలను తీసుకురావడానికిగానూ యుద్ధప్రాతిపదికన కాల్వ తవ్వకాలు జరుగుతున్నాయి. అదే సందర్భంలో వైరాలో ప్రజావైద్యంపై దృష్టి సారించి వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి నిధులు కేటాయించారు. దానికి శుక్రవారం శంకుస్థాపన చేయబోతున్నారు.

2007-2009లో ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో రూ.67కోట్లతో వైరా కాల్వల ఆధునీకరణ పనులను చేయించిన భట్టి విక్రమార్క, దాదాపు 14ఏళ్ల తర్వాత ఆయనే స్వయంగా రెండో విడత ఈ కాల్వల ఆధునీకరణ కోసం రూ.42కోట్ల నిధులను మంజూరు చేసి ఆపనులను కూడా ప్రారంభించనున్నారు. అలాగే తమ స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో ఎంతో ప్రాశత్యం చరిత్ర కలిగిన రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధితో పాటు భూగర్భజలాలను పెంచి రైతుల వ్యవసాయానికి నీరందించేందుకుగానూ రూ.13కోట్లతో వైరా నదిపై చెక్‌డ్యాం, నదికి రెండు వైపులా రక్షణ గోడలు, భక్తుల సౌకర్యం కోసం రూ.66లక్షలతో స్నానఘట్టాలు నిర్మించేందుకు శిలాఫలకం వేయనున్నారు.



వైరా మునిసిపాలిటీలో అమృత పథకం కింద రూ.26.87కోట్లతో మంచినీటి పథకాల అభివృద్ధికి శంకుస్థాపన చేయనున్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గాలైన కొడంగల్, మధిరతోపాటు వైరాలో కూడా ఇంటర్నేషనల్ స్థాయి సమీకృత గురుకుల విద్యాలయం నిర్మాణానికి కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటికే భట్టి విక్రమార్క భరోసాతో 14ఎకరాల కేవీసీఎం స్థలాలు, భవనాలను ప్రభుత్వానికి స్వాధీనం చేశారు. భట్టి విక్రమార్క తొలి ప్రయత్నంలోనే తన సొంత నియోజకవర్గమైన మధిరతోపాటు వైరా అభివృద్ధికి కూడా మార్గాన్ని సుగమం చేశారు.

నా కష్టసుఖాల్లో పాలుపంచుకున్న వ్యక్తి జక్కంపూడి

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తల్లాడ, ఆగస్టు 8: రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన నాటి నుంచి జక్కంపూడి కృష్ణమూర్తి తనతో అనుబంధాన్ని పెనవేసుకొని కష్టసుఖాల్లో పాలుపంచుకున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం తల్లాడలోని ఆర్‌బీ గార్డెన్‌లో జక్కంపూడి కృష్ణమూర్తి-ప్రేమలత దంపతుల సంస్మరణ సభ జిల్లా కాంగ్రెస్ నాయకుడు గుత్తా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సభలో తుమ్మల మాట్లాడుతూ సత్తుపల్లి నుంచి తాను పోటీచేసిన మొదటి ఎన్నికల్లోనే తనకు పరిచయం లేకపోయినా, జక్కంపూడి కృష్ణమూర్తి తనకు మద్దతునిచ్చారని గుర్తుచేశారు. తాను మంత్రి అయినప్పటి నుంచి సత్తుపల్లి నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరిగితే మధిర నియోజకవర్గంలో ఉన్న తల్లాడ మండలంలో కూడా అటువంటి అభివృద్ధి జరగాలని కృష్ణమూర్తి పట్టుబట్టేవారని తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన జక్కంపూడి కృష్ణమూర్తి ధన్యజీవి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, సీపీఎం జిల్లా నాయకుడు కల్యాణం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


జక్కంపూడి దంపతుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

విషపు పురుగు కరిచి వ్యక్తి మృతి

గుండాల, ఆగస్టు 8: పొలం పనుల్లో నిమగ్నమైన క్రమంలో విషపు పురుగు కరచి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని కోనవారిగూడెం గ్రామానికి చెందిన సనప రవి(40) గురువారం ట్రాక్టర్‌తో పొలం దమ్ము చేయడానికి వెళ్లాడు. దమ్ము చేస్తున్న క్రమంలో కాలుకు ఏదో కుట్టినట్లు అనిపించగా, అంతగా గ్రహించలేక పోయాడు. ఇంటికి వచ్చిన తరువాత రాత్రి నుంచి నాలుక మంద పడటం, శరీరం అంతా తిమ్మిర్లు పట్టడంతో, కుటుంబ సభ్యులు వెంటనే అతడిని 108 ద్వారా గుండాల ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పాము కరచి ఉండవచ్చునని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.


రవి(ఫైల్)

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి: డీఎస్పీ

చుంచుపల్లి, ఆగస్టు 8: రౌడీ షీట్స్, సస్పెక్ట్ షీట్స్ ఉన్న వారు సత్ప్రవర్తనతో మెలగాలని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. గురువారం కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సస్పెక్ట్, రౌడీ షీటర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించి మాట్లాడారు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. శాంతియుత వాతావరణంలో నిర్వహించే లక్ష్యంతో ప్రజా శాంతికి భంగం కలుగకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రౌడీ షీటర్స్, సస్పెక్ట్ ఎలాంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ప్రవర్తన మార్చుకోకుండా ఎవరైనా శాంతి భద్రతలకు భం గం వాటిల్లేలా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉన్నతాధికారుల ఆదేశాలతో పీడీ యాక్ట్‌లు నమోదు చేయ డం జరుగుతుందన్నారు. నియమ, నిబంధనలను పాటి స్తూ మంచిగా మెలిగే వారిపై ఉన్నతాధికారులు షీట్స్‌ను తొలగించే విధంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సీఐ రమేష్, సిబ్బంది బుచ్చిబాబు, రాజా పాల్గొన్నారు.

12శాతం రిజర్వేషన్లు కల్పించాలి

● తెలంగాణ మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు8: రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించి, అమలు చేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి, మాదిగల రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం ఖమ్మంనగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలమైన తీర్పు వెల్లడించి దేశంలో అన్ని రాష్ట్రాలు ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ జనాభ దామాషా ప్రకారం అమలు చేయాలని, ఆ అధికారి రాష్ట్రాలకే ఉందని ఇచ్చిన తీర్పు అభినందనీయమన్నారు. తెలంగాణ మాదిగల చిరకాల డిమాండ్ అయిన 12శాతాన్ని అమలుచేయాలన్నారు. ఈనెల11న హైదరాబాదులో జరిగే మాదిగ సంఘాల సదస్సును జయప్రదం చేయాలని తెలిపారు. ఈవిలేకరుల సమావేశంలో మాదిగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కొడారి వినాయకరావు, మాదిగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మట్టె గురుమూర్తి, చారి శ్రీరామ్, మీసాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, ఆచారాలపై అవగాహన ఉండాలి

● ఐటీడీఏ పీవో బి.రాహుల్

భద్రాచలం, ఆగస్టు 8: గిరిజన విద్యార్థులు వారి ఆచార వ్యవహారాలు, పండుగల ప్రాముఖ్యతపై తగిన విధంగా అవగాహన ఉండాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన భవనంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఉపన్యాస పోటీల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ నేటి తరానికి గిరిజనులు జరుపుకునే ముఖ్యమైన స్థానిక పండుగల ప్రాముఖ్యతను గురించి, ప్రస్తుత ఆదివాసీ జీవన విధానం ప్రాముఖ్యత విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పది మందిలో మన ఆచార వ్యవహారాల గురించి వేదికలపై ఎటువంటి భయం లేకుండా ప్రసంగించాలన్నారు. విద్యార్థులు పై చదువుల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా మన సంస్కృతి గురించి అక్కడి ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య, హెచ్‌ఎంలు భద్రయ్య, బుచ్చి రాములు, నాగమణి, సరోజిని, సుభద్ర, కృష్ణయ్య, రాధా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టు
కాల్వలో పడి మేకల కాపరి మృతి

ములకలపల్లి, ఆగస్టు 8: సీతారామ ప్రాజెక్టు కాల్వలో పడి మేకల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని ఒడ్డు రామవరం గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొర్రెపోతు సీతారామ ప్రాజెక్టు కాల్వలో పడటంతో దానిని కాపాడేందుకు వెళ్లి భూక్యా రాములు 964) మృతి చెందాడు. గ్రామస్థులు సీతారామ ప్రాజెక్టు కాల్వలో వెతికి బయటకు తీశారు. మృతి చెందిన వ్యక్తికి ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య గంసి ఫిర్యాదు మేరకు ములకలపల్లి పోలీస్‌స్టేషన్ హౌస్‌ఆఫీసర్ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని 15 మేకలు...

అశ్వాపురం, ఆగస్టు8: రైలు ఢీకొని సుమారు 15 మేకలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొమ్ముగూడెం రైల్వేగేట్ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. తురుమలగూడెం తండాకు చెందిన ధరావత్ సుక్య, బానోత్ తులసియా, ఆటియాలకు చెందిన మేకలు రైల్వేగేట్ సమీపంలో మేతకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో రైల్వేగేట్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టడంతో 15 మేకలు అక్కడికక్కడే మృతి చెందగా, పలు మేకలకు తీవ్రగాయాలయ్యాయి. కొత్తగూడెం రైల్వే పోలీసులు సంఘటనపై విచారణ జరుపుతున్నారు. మృతి చెందిన మేకల విలువ సుమారు రూ.2లక్షలకు పైగానే ఉంటాయని బాధితులు తెలిపారు.

కార్గోలో గుట్కాల సరఫరా

● స్వాధీనం చేసుకున్న ఇల్లెందు పోలీసులు

ఇల్లెందుటౌన్, ఆగస్టు 8: ఆర్టీసీ కార్గో పార్సిల్‌లో అక్రమంగా రవాణా చేసిన గుట్కాలను ఇల్లెందు పోలీసులు గురువారం స్వాధీన పరుచుకున్నారు. ఇల్లెందు సీఐ బత్తుల సత్యానారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి ఇల్లెందుకు తరలిస్తున్న సుమారు రూ.45 వేల విలువ చేసే గుట్కాలను ఇల్లెందు బస్టాండ్ కార్గో సర్వీస్‌లో పోలీసులు స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. ఇల్లెందుకుదుకు చెందిన ఎల్లంకి నాగేశ్వరరావు అనే వ్యాపారికి ఈ గుట్కాలు సరఫరా చేసేందుకు కార్గో సర్వీస్‌లో ఉండగా, అందిన సమాచారం మేరకు తనిఖీలు చేయగా గుట్కాలు లభ్యమైనట్టు సీఐ తెలిపారు. గుట్కాలను స్వాధీన పరుచుకుని వ్యాపారి నాగేశ్వరరావును అరెస్టు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

మత్తుపదార్థాల నివారణకు
నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 8: మత్తు పదార్థాలను గుర్తించేందుకు పోలీసులు అశ్వారావుపేటలో గురువారం నార్కోటిక్ డాగ్‌తో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాల విక్రయాలు, రవాణా జరగకుండా ఉండేందుకుగాను ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. అశ్వారావుపేటలోని ఆర్టీసీ బస్టాండ్, అనుమానిత ప్రాంతాలు, నివాసాలు, హోటల్స్, పాన్ దుకాణాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఐ శివరామకృష్ణ మాట్లాడుతూ మత్తు పదార్థాలను గుర్తించేందుకు తమ శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగానే మత్తు పదార్థాలను గుర్తించేందుకు డాగ్‌కు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. మత్తుపదార్థాల నివారణే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. మత్తుపదార్థాలకు సంబంధించి విక్రయాలు, వినియోగం, రవాణా గురించి సమాచారం తెలిస్తే తమకు వెంటనే సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

వైరాలో మంత్రి పొంగులేటి కార్‌కు పంక్చర్

● తృటిలో తప్పిన ప్రమాదం

వైరా, ఆగస్టు 8: వైరా సమీపంలో గురువారం ఉదయం రెవెన్యూ, సమాచారప్రసారాల శాఖ మంత్రి పొంగులేటి ప్రయాణిస్తున్న కారు టైర్ పంక్చర్ అయ్యింది. ఈ ఘటనతో మంత్రి తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. మంత్రి పొంగులేటి ఖమ్మం నుంచి ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరపు గ్రామంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వెళుతుండగా ఆయన ప్రయాణిస్తున్న కారు వెనుక టైర్ వైరా నదిపై ఉన్న హైలెవల్ వంతెన సమీపంలో జాతీయ రహదారిపై ఒక్కసారిగా పంక్చర్ అయ్యింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి కారును అదుపు చేయటంతో ప్రమాదం తప్పింది. తరువాత పొంగులేటి తన కాన్వాయ్‌లోని మరో కారులో అక్కడినుంచి వెళ్లిపోయారు.


వైరాలో పంక్చర్ అయిన మంత్రి కారు

'ఆయిల్‌పామ్ దిగుబడులపై ఆందోళనొద్దు'

అశ్వారావుపేట, ఆగస్టు 8: ఆయిల్‌పామ్ దిగుబడులు తగ్గుతుండటం పట్ల రైతులు ఆందోళన పడవద్దని ఐఐపీఆర్ సైంటిస్ట్ (రిటైర్డ్ ప్రిన్స్‌పాల్) బీఎస్ రావు రైతులకు సూచించారు. గురువారం జిల్లా ఉద్యాన అధికారి సూర్యనారాయణ, ఆయిల్‌ఫెడ్ డివిజన్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ, ఆయిల్‌ఫెడ్ రిసోర్స్‌పర్సన్ రాజశేఖర్‌రెడ్డిల బృందం మల్కారం, లింగాలపల్లిలోని పలు తోటలను పరిశీలించారు. అనంతరం నారంవారిగూడెంలోని ఆయిల్‌ఫెడ్ డివిజన్ కార్యాలయంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆయిల్‌పామ్ దిగుబడుల్లో తగ్గుదల వచ్చిన మాట వాస్తవమేనని, అయితే ఏడాది సరాసరి దిగుబడుల్లో పెద్దగా వ్యత్యాసం ఉండకపోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సహకార రంగానికి
నిధుల కేటాయింపు పెంచాలి

● రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ ఉపనేత వద్దిరాజు

ఖమ్మంటౌన్, ఆగస్టు 8: కేంద్ర ప్రభుత్వం సహకార రంగానికి నిధుల కేటాయింపును పెంచాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ ఉపనేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కోరారు. గురువారం వద్దిరాజు రాజ్యసభలో సహకార రంగంపై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాలు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకులు వివరాలను సమగ్రంగా ఆన్‌లైన్‌లో రూపొందించినా, సహకార రంగ అభివృద్ధికి నిధుల కేటాయింపు సరిగా లేకపోవడం దురదృష్టకరమన్నారు. 2022-23 బడ్జెట్లో సహకార శిక్షణ కోసం రూ.55కోట్లు కేటాయించినా, అందులో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. ఇక 2024-25 బడ్జెట్లో కేవలం రూ.లక్ష రూపాయలు కేటాయించడం విచారకరమన్నారు. సహకార శిక్షణ, విద్యకు ఉన్న ప్రాముఖ్యతను కేంద్ర ప్రభుత్వం గుర్తించడం లేదని, వెంటనే బడ్జెట్‌లో ఎక్కువ నిధు లు కేటాయించి, వాటిని సద్వినియోగం చేయాలని వద్దిరాజు కోరారు.

12న మధిరలో పాలిసెట్ స్పాట్ కౌన్సిలింగ్

మధిర, ఆగస్టు 8: మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 12న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సాంబయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మెకానికల్, సివిల్ కోర్సులలో ఖాళీల కోసం అదే రోజు కౌన్సిలింగ్ జరిపి తీసుకోవడం జరుగుతుందన్నారు. 2024లో పాలిసెట్, పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 8వతేదీ నుంచి 11వతేదీలోపు ఖాజీపురంలోని మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హైదరాబాద్‌లోనూ 12న స్పాట్ కౌన్సిలింగ్

రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉన్న ఖాళీలకు ఈనెల 12న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ నందు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని మధిర ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణీదేవి గురువారం ఒక ప్రకటనలతో తెలిపారు. 12వతేదీ ఉదయం 10గంటలకు వివిధ డిప్లొమా కోర్సులైన డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, ఆర్గానిక్ అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కోర్సులకు స్పాట్ కౌన్సిలింగ్ జరుగుతుందని తెలిపారు. ఈకౌన్సిలింగ్‌లో పాలిసెట్ రాసిన వారు, పాలిసెట్ రాసి రిజిస్ట్రేషన్ చేసుకోనివారు, పాలిసెట్ రాయని పదోతరగతి, సమానమైన పరీక్షలలో మెరిట్ సాధించిన విద్యార్థులు నేరుగా పాల్గొని ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశం పాలిసెట్ రాయలేని పదోతరగతి విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈకోర్సులలో రెగ్యులర్ సీట్లు 283, ఈడబ్ల్యూఎస్ కింద 55 సీట్లు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఇతర సమాచారం కోసం యూనివర్శిటి వెబ్‌సైట్‌ను సందర్శించాల్సిందిగా తెలిపారు.

అవకాశాలను వినియోగించుకోవాలి

● భద్రాద్రి జిల్లా నోడల్ అధికారి వెంకటేశ్వరరావు


చుంచుపల్లి, ఆగస్టు 8: నిరుద్యోగులు అవకాశాలను వినియోగించుకోవాలని భద్రాద్రి జిల్లా నోడల్ అధికారి హెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ కత్తి రమేష్ ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ కంపెనీ-బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ వారి సౌజన్యంతో విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బండి వెంకటేశ్వర్లు, సముద్రాల శ్రీనివాస్, దస్తగిరి, శంకర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. వివిధ కేటగిరిలో 57 పోస్టులకు భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించగా, 83 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థులు ఎంపిక జాబితా చేస్తామని వరుణ్ మోటార్స్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ కార్యాలయ సిబ్బంది రమణయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో బంగ్లా దేశీయులు?

● గతంలో అరెస్ట్ చేసి తిరిగి వారి దేశానికి పంపిన పోలీసులు

ఖమ్మం క్రైం, ఆగస్టు8: బంగ్లాదేశ్ అల్లర్లు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోకి వచ్చిన పలువురు బంగ్లాదేశీయులు ఖమ్మంలో తిరుగుతున్నట్టు ప్రచారం జరుగుతుంది. గతంలో కూడా ఏలాంటి అనుమతులు లేకుండా ఖమ్మంలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న పలువురు బంగ్లాదేశీయుల మైనర్లను ఖమ్మం కార్మిక శాఖ అధికారులు ఆపరేషన్ ముస్కాన్‌లో పట్టుకుని ఖమ్మం స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు అప్పగించారు. తరువాత వారి పాస్‌పోర్ట్‌లు సేకరించిన పోలీసులు వారి నుంచి పలు వివరాలు సేకరించారు. అనంతరం చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు సమక్షంలో ఉన్న వారిని రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు తిరిగి వారి దేశానికి పంపించారు. కానీ ప్రస్తుతం అక్కడ అల్లర్లు జరుగుతుండగా, కొంతమంది రాష్ట్రానికి వచ్చారని, వారిలో కొంతమంది ఖమ్మానికి చెరుకున్నారని ప్రచారం జరుగుతుంది. ఖమ్మంలో పనిచేసేందుకు పలు ఫ్యాక్టరీలు ఉన్న నేపథ్యంలో వారు ఖమ్మం చెరుకున్నట్టు ప్రచారం జరగుతుంది. కాగా ఈ ఘటన పై ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తిని వివరణ కోరగా..గతంలో ఉన్న వారిని తిరిగి వారి దేశానికి పంపించివేశామని, అలాంటి వారు ఎవ్వరు లేరని, అపోహాలు ఎవ్వరు నమ్మవద్దని తెలిపారు.



టేకులపల్లి ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

టేకులపల్లి, ఆగస్టు 8: టేకులపల్లి మండల ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా గుర్రం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బానోతు దస్రూ, గౌరవ అధ్యక్షుడిగా ధర్మపురి శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షులుగా ఎండీ పాష, సహాయ కార్యదర్శులుగా సుగ్గల గోపి, రాయల ప్రశాంత్, కోశాధికారిగా గంగారపు శేషయ్య, ప్రెస్‌క్లబ్ ఇన్‌చార్జ్‌గా తాడోజు సందీప్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు.



ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి, అధ్యక్షుడు

పాల్వంచ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నా..

▸▸ మున్సిపాలిటికి ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నా: ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ టౌన్, ఆగస్టు 8: పాల్వంచ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టంచేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజలతో ఎమ్మెల్యే ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ పాల్వంచ మున్సిపాలిటి ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాన్ని ఏర్పాటుచేయడానికి ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. పాల్వంచ మండల, పట్టణ పరిధి అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలోని వార్డుల్లో రక్షిత మంచినీరు. సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి కావాల్సిన నిధులు మంజూరు అయ్యాయని, నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషి, నిర్ణయాలతో నియోజకవర్గంలో సమస్యలన్నీ పరిష్కరించుకుందామని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం అందుబాటులో ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్వంచ తహసిల్దార్ వివేక్, మున్సిపల్ కమీషనర్ డాకునాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, రాష్ట్రసమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, కాంగ్రెస్‌పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు, సీపీఐ పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, డి. సుధాకర్, వి. పద్మజ, సీపీఐ, ఏఐటీయూసీ, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్, రెవెన్యూ, ఎలక్ట్రికల్, పబ్లిక్ హెల్త్, పంచాయతీ రాజ్‌శాఖల డీఈలు, ఏఈలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

ఎమ్మెల్యే కూనంనేనికి ఘన సన్మానం

పట్టణ పరిధి గట్టాయిగూడెం ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి గాను రూ. 94లక్షల అభివృద్ధి నిధులు కేటాయించినందుకు గాను సీనియర్ కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి మనోహర్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును శాలువ, బొకేలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి మహేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు పట్వా వీరకుమార్, శాంతివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్య, వైద్యం పేదల దరిచేరాలి: కూనంనేని

కొత్తగూడెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఉచిత విద్య వైద్యం అందుబాటులోకి వచ్చినప్పుడే పేదలకే మేలు జరుగుతుందని పాలకులు ప్రవేశపెట్టే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కంటి తుడుపు మాత్రమేనని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో 177 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 53.34లక్షల విలువ చేసే చెక్కులను గురువారం పట్టణంలోని శేషగిరిభవన్‌లో జరిగానకార్యక్రమంలో అందించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, జిల్లా కార్యవర్గసభ్యులు ముత్యాల విశ్వనాథం, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు, జిల్లాసమితి సభ్యులు కంచర్ల జమలయ్య, భూక్యా దస్రు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

▸▸ ప్రతీ ఇంట ఇంకుడు గుంత ఏర్పాటుచేసుకోవాలి
▸▸ డీఎల్‌పీవో సుధీర్‌కుమార్
▸▸ కొనసాగుతున్న స్వచ్ఛదనం- పచ్చదనం
▸▸ గ్రామాల్లో వైద్య శిబిరాలు, ఫీవర్ సర్వేలు
▸▸ తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

కరకగూడెం, ఆగస్టు 8: ప్రజలు తప్పకుండా ప్రతి ఇంట ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని జిల్లా డివిజనల్ పంచాయతీ అధికారి సుధీర్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలో పర్యటించిన ఆయన ప్రధాన రహదారిపై గుంతలను గుర్తించి కొలతలు తీసుకున్నారు. అనంతరం స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంకుడు గుంత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నీరు నిలచిన ప్రదేశాల్లో వైద్య సిబ్బందితో కలిసి గంబూషియా చేపలను వదిలారు. ప్రధాన రహదారిపై దమ్ము చక్రాలతో తిరుగుతున్న ట్రాక్టర్ వారిని దమ్ము చక్రాలతో రహదారిపై తిరిగితే పాడవుతాయని రహదారిపై దమ్ము చక్రాల వాహనాలు తిరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎం పీడీవో కుమార్, హెచ్‌ఈ క్రిష్టయ్య, వైద్యాధికారి మధు, పం చాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

●అశ్వాపురం: గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులకు తెలిపారు. గురువారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. మురుగు గుంటలలో గంబూషియా చేపలను, ఆయిల్‌బాల్‌లను వదిలారు. మురుగు గుంటలలో మట్టి పోయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రశీద్, ఎంపీడీవో వరప్రసాద్,మండల వైద్యాధికారిణి సంకీర్తన, ఆర్ఐ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నిల్వ నీటిలో గంబూషియా చేపలను వదులుతున్న దృశ్యం

మండలవ్యాప్తంగా ర్యాపిడ్ ఫీవర్ సర్వే

●అన్నపురెడ్డిపల్లి: అధిక వర్షాల దృష్ట్యా, ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా యర్రగుంట ప్రభుత్వాసుపత్రి వైద్యులు మండల వ్యాప్తంగా గురువారం ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అధిక వర్షాలకు నీరు గుంతల్లో చేరడం గుర్తించి ఆయిల్ బాల్స్ వేసినట్లు వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిశరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సిబ్బంది, ఆశాలు, ఆయా పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గోన్నారు.

●జూలూరుపాడు: ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యశాఖ ఆధ్వర్యంలో జ్వర పీడితుల గుర్తింపునకు గురువారం సర్వే నిర్వహించారు. వైద్య సిబ్బంది గ్రామాలలో పర్యటించి ఇంటింటికి వెళ్లి జ్వరాల బారిన పడిన వారి వివరాలను నమోదు చేసుకున్నారు. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

బూర్గంపాడు: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మనం ఆరోగ్యంగా ఉంటామని మోరంపల్లిబంజర పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ లక్ష్మీసాహితి అన్నారు. బూర్గంపాడు మండల పరిదిలోని మోరంపల్లిబంజర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా గురువారం మొక్కలు నాటారు. లక్ష్మీపురం, దేవయ్యగుంపు, బత్తులనగర్ గ్రామాలలో ఉన్న నీటి గుంటలలో గంబుసియా చేపలను వదిలారు. లక్ష్మీపురం గ్రామంలో బిసి గురుకుల హస్టల్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 92మంది విద్యార్థులను పరీక్షించి రెండు రక్తపూతలు సేకరించి ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సోమ్లా, అయుష్ డాక్టర్ జయ, హెచ్‌ఈవో రవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లపల్లిలో డీఎంహెచ్‌వో ఆస్మికతనిఖీ

●ఆళ్లపల్లి: ఆళ్లపల్లి మండలంలో పీహెచ్‌సీ, వైద్య శిబిరాలను డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతోగులో గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు వర్షకాలంలో సీజన్ వ్యాదులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. అనంతనం ఆళ్లపల్లి పీహెచ్‌సీ పరిశీలించారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో కార్యాక్రమంలో భాగంగా పీహెచ్‌సీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్ రేవంత్, ఎంపీడీవో శ్రీను, ఎంపీవో శ్రీనివాసరావు, ఎస్సీడీ మ ధువరున్, వైద్య సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

మీ ఆరోగ్యం మీ చేతిలో ఉంది

●ఆళ్లపల్లి: ఇంటి చుట్టు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే మీ ఆరోగ్యం మీ చేతిలో ఉంటుందని ఆళ్లపల్లి ఎంపీడీవో శ్రీనివాసరావు మర్కోడు గ్రామస్తులకు సూచించారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యాక్రమంలో భాగంగా గురువారం ఆయన మర్కోడు పంచాయతీ కార్యాదర్శి నాగరాజుతో కలిసి గ్రామంలో పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాసరావు, మండల పరిషత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కొత్తగూడెంలో మంత్రి పొంగులేటి పర్యటన

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 8: రెవెన్యూ గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శుక్రవారం కొత్తగూడెం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ బీట్‌లో వన మహోత్సవాన్ని ప్రారంభించనున్నారు. 9.30గంటలకు అశోక్‌నగర్ గ్రామపంచాయతీలోని సైడ్ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపనచేయనున్నారు. అనంతరం పాల్వంచలోని సింథటిక్ టెన్నిస్‌కోర్టు ప్రారంభోత్సవానికి వెళ్లనున్నారు. 10.45 గంటలకు కలెక్టరేట్‌లో ఐడీవోసీ ఇందిరామహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్లు క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది.

ఘనంగా వేంకటేశ్వరస్వామి విగ్రహప్రతిష్ఠ మహోత్సవం



ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొత్తగూడెం సాంస్కృతికం, ఆగస్టు 8: పట్టణ పరిధిలోని దుర్గాబస్తీ ఆలయంలో శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరుస్వామి గరుడ యంత్ర శిఖర విగ్రహస్థిర ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ మహోత్సవాల్లో భాగంగా గురువారం మంగళ వాయిద్యాములు, గణపతిపూజ, సామూహిక హోమాలు, ధాన్య, జల పుష్పక్షీరాదివాసాభిషేకాలు వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదమంత్రోర్చనలు, గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మూడురోజులపాటు ఈ మహోత్సవాల్లో భాగంగా 9వ తేదీన శ్రీ వేంకటేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, నారయణసేవా(అన్నదానం)కార్యక్రమమును నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకులు రుక్మిణి, లత, ఇందిరా, జానకి, పద్మ, సంధ్య, డాక్టర్ భూపతిరావు, వెంకటరత్నం, తాడూరి వెంకటరాజు,బి. రాజేశ్వరరావు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నవగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు



శివాలయంలో ప్రత్యేక పూజాలు

ఇల్లెందు ఆగస్టు 8: పట్టణంలోని శ్రీ జగదాంబ సమేత కాశీవిశ్వశ్వర స్వామి దేవాలయంలో గురువారం సతీసమేత నవగ్రహ విగ్రహాలు, శ్రీకాలభైరవ శ్రీగురుదక్షణమూర్తి సందీశ్వర ఆలయశిఖర కళాశాల ప్రతిష్ఠాపన వేడుకలు ప్రారంభ మయ్యాయి. 75ఏళ్ల క్రితం నెలకొల్పిన శివాలయ ప్రాంగణంలో యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠాపన పూజలు అర్చకులు శివన్నారయన శర్మ, జగన్మోహనస్వామి, నాగభూషణ శర్మల ఆధ్వర్యంలో వేడుకలు ప్రారంభించారు. శనివారం శ్రీశైవ క్షేత్ర పీఠం పీఠాధిపతులు శ్రీ శివ స్వామిజీ విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకల్లో పాల్గొంటారని అనుగ్రహ భాషణం చేస్తారని ఆలయ మేనేజర్ ఎస్.అనువంశిక ధర్మకర్తలు నరేష్,నీరజ్, ఆనంద్ తెలిపారు.ఈకార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బుద్దాదేవ్ భట్టాచార్య పట్ల సంతాపం

ఇల్లెందు టౌన్, ఆగస్టు 8: సీపీఎం సీనియర్ నాయకులు, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్దాదేవ్ భట్టాచార్య మృతి పట్ల సీపీఎం నాయకులు సంతాపం ప్రకటించారు. గురువారం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్‌నబీ తాళ్లూరి కృష్ణ, కాలేటి కిరణ్‌కుమార్, రాజమౌళి, వీరయ్య తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

మెనూ పాటించాలి: డీఈవో

సుజాతనగర్, ఆగస్టు 8: మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని డీఈవో వెంకటేశ్వరా చారి అన్నారు. గురువారం సుజాతనగర్ మండలంలోని సర్వారంలో గల ఉన్నత పాఠశాలను స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్లానింగ్ కో - ఆర్డినేటర్ ఎస్ సతీష్ కుమార్‌తో కలిసి సందర్శించారు. దీనిలో భాగంగా సర్వారం ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారా లేదా అని పరిశీలించారు. అదే విధంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్ ఎంపీడీవో భారతి, సుజాతనగర్ ఏంఈఓ బి. జుంకిలాల్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించకుంటే చర్యలు: ప్రత్యేకాధికారి

జూలూరుపాడు: ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం బాలికలకు భోజన పదార్థాలను అందించాలని లేకుంటే చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి పి. రుక్మిణిదేవి అన్నారు. గురువారం ఆమె మండలంలోని మాచినేనిపేట తండా, మాచినేనిపేట గ్రామాలను సందర్శించి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పరిశీలించి మొక్కలను నాటారు. ఆ తరువాత ఆమె మండల పరిషత్ కార్యలయాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ తులసీరాం, సీహెచ్‌ఓ రామకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం సుభద్ర పాల్గొన్నారు.

నేడు రామాలయంలో తొలి శ్రావణ శుక్రవారం పూజలు

భద్రాచలం, ఆగస్టు 8: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నేడు శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలంయంలో లక్ష్మీతాయారు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, కుంకుమార్చన, పూజలు నిర్వహించనున్నారు.

అథ్లెటిక్స్‌లో అఫ్రిన్‌కు బంగారు పతకం

అశ్వాపురం ఆగస్టు 8: రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో అండర్-16 విభాగంగా అశ్వాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అఫ్రీన్ బంగారు పతకం సాధించింది. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శేషుబాబు అఫ్రీన్‌ను ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలి

▸▸ ప్రత్యేకాధికారి గౌతమ్ ▸▸ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం

కొత్తగూడెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కార్యక్రమాన్ని పరిశీలించేందుకు వచ్చిన జిల్లా ప్రత్యేక అధికారి, సీడీఎంఏ డైరెక్టర్ వీపీ గౌతమ్ గురువారం భద్రాద్రి కొత్తగూడెం పట్టణం, చుంచుపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. విద్యానగర్ గ్రామపంచాయతీలో రైన్ వాటర్ హార్వేస్టింగ్ స్ట్రక్టర్ (వర్షపు నీటిని ఒడిసిపట్టే ఇంకుడు గుంత)ని పరిశీలించారు. ఇంకుడు గుంతని ఏ విధంగా తయారు చేశారు.. దానికి పట్టిన వరలెన్నీ.. నీరు ఎలా ఇంకుతుంది అనే విషయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రుద్రంపూర్ గ్రామ పంచాయతీలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మెడిసినల్ ప్లాంట్స్, టాలప్లాంట్స్, స్కూల్ గార్డెన్, కమ్యూనిటి ప్లాంటేషన్ మొక్కల విశిష్టతను కలెక్టర్‌ను గౌతమ్ అడిగి తెలుసుకున్నారు. తర్వాత పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. స్కూల్ విద్యార్థులకు కలెక్టర్, జిల్లా ప్రత్యేక అధికారి గౌతమ్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసి అభినందించారు. అనంతరం మున్సిపాలిటి పరిధిలోని పశుసంతతి నియంత్రణ కేంద్రం (యానిమల్ బర్త్ కంట్రోల్‌సెంటరు) ను సందర్శించి అక్కడ తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 27వ వార్డులోని ప్రగతిమైదానంలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, జిల్లా పంచాయతీ అధికారి వి. చంద్రమౌళి, జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్, డివిజనల్ పంచాయతీ అధికారి రమణరావు, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో చుంచుపల్లి వీడీవీ అశోక్‌కుమార్, మండల పంచాయతీ అధికారి గుంటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు సంజీవరెడ్డి, సత్యనారాయణ, నరేందర్‌నాని, రమేష్, ఈజీఎస్, ఏపీవో రఘుపతి, ఏపీఎం రామకృష్ణ, ఈజీఎస్ ఈసీ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామపంచాయతీ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రుద్రంపూర్ పాఠశాలలో మొక్కలు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి గౌతమ్

జిల్లాలో ముగ్గురు ఎస్ఐల బదిలీలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 8: జిల్లాలో ముగ్గురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ రోహిత్‌రాజు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో పాల్వంచ రూరల్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న బి.శ్రీనివాస్‌ను వీఆర్ భద్రాద్రి జిల్లాకు, సీసీఎస్ భద్రాద్రి జిల్లా ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కె.సుమన్ పాల్వంచ టౌన్ ఎస్ఐగా, అశ్వాపురం ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న బి.సురేష్‌ను పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీచేశారు.

ఎద్దులబండిపై నుంచిపడి రైతుకు గాయాలు

ఆళ్లపల్లి, ఆగస్టు 8: ప్రమాదవశాత్తు ఎద్దులబండి పై నుంచి కింద పడిన రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆళ్లపల్లి మండలంలో గురువారం జరిగింది. మండల పరిధిలోని రామనుజగూడెం గ్రామానికి చెందిన పుణెం సమ్మయ్య అనే రైతు గురువారం మొక్కజొన్న పంటకు ఎరువులు వేసి సాయంత్రం తన ఎద్దులబండిపై ఇంటికి వస్తున్న క్రమంలో దారిలో ఒక ఎద్దు మెడ పక్కన ఉన్న కనేం(కర్ర) ఇరిగిపోవడంతో ఎద్దు పక్కకు వెళ్లింది. దాంతో బండి ఒకపక్క వాలిపోవడంతో సమ్మయ్య బండి చక్రం కింద పడ్డాడు. దాంతో నడుముకు దెబ్బతగిలింది. కుటుంబ సభ్యులు వైద్యం కోసం కొత్తగూడెం తీసుకెళ్లారు.

అట్రాసిటీ కేసుల విచారణ

జూలూరుపాడు, ఆగస్టు 8: మండలంలోని పాపకొల్లు, జూలూరుపాడు గ్రామాలలో ఇటీవల ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదయ్యాయి. దీంతో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్ గురువారం రెండు గ్రామాలను సందర్శించారు. సంఘటన స్థలాలను పరిశీలించారు. సాక్షుల నుంచి వివరాలను సేకరించారు. జరిగిన సంఘటనలపై విచారణ నిర్వహించారు. అనంతరం జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రాణా ప్రతాప్, హెడ్ కానిస్టేబుల్ దయానంద్, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీ

దుమ్ముగూడెం ఆగస్టు 8: పర్ణశాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత అంశాలపై పర్ణశాల ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధికారి రేణుకారెడ్డి అవగాహన కల్పించారు.

మహిళలు ఆర్థిక స్థిరత్వం సాధించాలి: కలెక్టర్

సుజాతనగర్, ఆగస్టు 8: నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ మహిళలు ఆర్థిక స్థిరత్వం సాధించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సర్వారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన మహిళా ఆరోగ్య సమితి సమావేశానికి కలెక్టర్ హాజరైనారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో నీటి కుంటలను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. వీటిని ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భజలాలను పెంచుకోవచ్చానన్నారు. నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ మహిళలు ఆర్థిక స్థిరత్వం సాధించాలని తెలిపారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో మండల ప్రత్యేధికారి త్రినాథ్ బాబు, ఎంపీడీవో భారతి, తహసీల్దార్ శిరీష, ఏపీఎం మీరాభి, సీసీ శిరీష పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఒరిగిన కల్యాణ మండపం తొలగింపు పనులు

భద్రాచలం, ఆగస్టు 8: భద్రాచలంలోని కుసుమహరినాథబాబా ఆలయ ప్రాంగణంలో శిధిలావస్థకు చేరి ఒక వైపు ఒరిగిన కల్యాణ మండపాన్ని పూర్తిగా తొలగించే పనులు కొనసాగుతున్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో శతాబ్దకాలం నాటి కల్యాణ మండపం బుధవారం ఆలయ సమీపంలోని ఇళ్లవైపు ఒరిగింది. దీంతో అది పడిపోయే ప్రమాదముందని గుర్తించిన కలెక్టరు ఇతర అధికారులు వెంటనే సారపాక ఐటీసీ రెస్క్యూ బృందంతో కల్యాణ మండపాన్ని సురక్షిత ప్రాంతం వైపుకు ఒరిగేలా దిశను మార్చారు. అనంతరం గురువారం డ్రిల్లింగ్ ప్రక్రియ ద్వారా కళ్యాణ మండపంను తొలగించే పనులు చేపడుతున్నారు. ఈ పనులు శుక్రవారం నాటికి పూర్తవుతాయని తెలుస్తోంది.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కొత్తగూడెం లీగల్/మణుగూరు/దమ్మపేట/ఇల్లెందుటౌన్, ఆగస్టు 8: జనగామలో న్యాయవాదుల దంపతులపై పోలీసుల దాడిని ఖండిస్తూ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ వారి పిలుపు మేరకు కొత్తగూడెం, మణుగూరు, దమ్మపేట, ఇల్లెందులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. దాడిని వారు ఖండించారు. కార్యక్రమాల్లో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు తోట మల్లేశ్వరరావు, ఎమ్మెస్సార్ రవిచంద్ర, దూదిపాల రవికుమార్, సాదిక్‌పాషా, ప్రవీణ్‌కుమార్, సీనియర్, జూనియర్, న్యాయవాదులు పాల్గొన్నారు. మణుగూరులో అసోసియేషన్ అధ్యక్షుడు చిర్రా రవి, న్యాయవాదులు పాల్గొన్నారు. దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మారం సతీష్, లక్కినేని నరేందర్, గొంది మురళీమోహన్, మడుపు వెంకటరమణ, బాలరాజ్, గద్దల అప్పారావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు. ఇల్లెందులో బార్ అసోసియేషన్ కార్యదర్శి కే. ఉమామహేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు నాగళ్ల మల్లిఖార్జున్‌రావు, మేకల దుర్గయ్య, దంతాల ఆనంద్, సుడిగాలి వెంకట నర్సయ్య, బాలకృష్ణ, అయిలయ్య, మహేష్, సుధాకర్, అనీల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఇల్లెందు టౌన్, ఆగస్టు 8: ఇల్లెందు పట్టణంలోని జేబీఎస్ పాఠశాలలో విద్యార్థులకు తాగు నీటి సరఫరా లేకపోవడంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో నీరు సరిగా లభ్యం కాక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవడంతో తక్షణమే నీటి సరఫరాను చేపట్టాలని కోరుతూ పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో పాఠశాలలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అభిమన్యు, పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి జే. గణేష్ నాయకులు కిషన్, రాము, నాగరాజు, సందీప్, విష్ణు పాల్గొన్నారు.

27న దివ్యాంగ పిల్లల నిర్ధారణ పరీక్షలు

అశ్వారావుపేట టౌన్ ఆగస్టు 8: దివ్యాంగ పిల్లలకు అవసరమైన ఉపకరణలు అందజేసేందుకు కొత్తగూడెంలో ఈ నెల 27న నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఎంఈవో లక్ష్మీ ఓ ప్రకటనలో గురువారం ఎంఈవో కార్యాలయంలో తెలిపారు. అన్ని యజమాన్య పాఠశాలల్లో ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను వారి తల్లిదండ్రులు పరీక్షా కేంద్రానికి తీసుకు వెళ్లాలని ఆమె సూచించారు. రాష్ట్ర సమగ్ర శిక్షణ ఆలింకో ఆధ్వర్యంలో పిల్లలకు అవసరమైన ఉపకరణలు వినికిడి యంత్రాలు. వీల్ చైర్స్ . చంక. కర్రలు. ట్రైసైకిల్స్ . రోలేటర్స్ . బ్రెయిలికిట్స్ అందజేస్తారని తెలిపారు.పూర్తి వివరాలు కోసం సెల్ నెం ఎంఈవో లక్ష్మీ 8074781578 ఐఆర్ పిలు లక్ష్మీ 9603208851. రామరావు 8247006269 సంప్రదించాలని ఎంఈవో లక్ష్మీ తెలిపారు.

రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తోంది: ఎమ్మెల్యే కోరం

టేకులపల్లి, ఆగస్టు 8: రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తోందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని పెగళ్లపాడులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.20లక్షలు నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోనికాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేసి తీరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్‌రావు, పంచాయతీ ప్రత్యేకాధికారి తార, పంచాయతీరాజ్ డీఈ రాంకిషన్, ఏఈ నవీన్, పంచాయతీ కార్యదర్శి సతీష్, సొసైటీ డైరెక్టర్ లక్కినేని శ్యామ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భూక్యా దేవానాయక్, జిల్లా నాయకులు కోరం సురేందర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు సరోజ, మాజీ సర్పంచ్ రమాదేవి పాల్గొన్నారు.



పెగళ్లపాడులో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పదవుల కన్నా ప్రజాసేవమిన్న

పదవులు తాత్కాలికమని ప్రజాసేవ శాశ్వతంగా ఉంటుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. టేకులపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల పరిషత్ పాలకవర్గ పదవీ వీడ్కోలు ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీటీసీలుగా ప్రజాప్రతినిధులుగా అవకాశం దక్కడంతో సద్వినియోగం చేసుకొన్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగభవానీ, ఎంపీడీవో రవీందర్‌రావు, ఎంపీవో గణేష్ గాంధీ, మాజీ ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మా రోడ్డుకు శాశ్వత పరిష్కారం లేదా..?

● తెగిన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేసుకున్న రాయిగూడెం గ్రామస్థులు

ఆళ్లపల్లి, ఆగస్టు 8: ఎన్నికల్లో ప్రజాప్రతినిధుల హామీలు.. అధికారుల మాటలు నీటిబుడగలే అంటు రాయిగూడెం గ్రామస్తులు ఆగ్రహిస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని రాయిగూడెం గ్రామానికి వేళ్లే దారిలో ఊరవాగుపై తాత్కాలిక పైపుల కల్వర్టు తెగిపోవడంతో గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. దాంతో గురువారం గ్రామస్థులు ఒక్కటై ఇసుక బస్తాలు, మట్టితో పైపులపై వేసి రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. ప్రతీ ఏడాది వేసవిలో రోడ్డు వేయడం, తాత్కలిక కల్వర్టు ఏర్పాటు చేయడం, అది వర్షాకాలంలో కొట్టుకపోవడం పరిపాటిగా మారిందని, మా గ్రామానికి శాస్వతంగా రోడ్డు వేసే నాయకులు, అధికారులు లేరా అంటు రాయిగూడెం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తు తెగిపోయిన రోడ్డుకు మరమ్మతులు చేసుకున్నారు.



రోడ్డు తెగిన చోట ఇసుక బస్తాలు వేస్తున్న గ్రామస్థులు